నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, శనివారం 18 మే 2024 | NALGONDA

19న ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి చెస్ పోటీలు

బొడ్రాయి బజార్, మే 17 : సూర్యాపేట జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ భవన్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గండూరి కృపాకర్, ఎల్.సతీశ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన 7, 13, 17 సంవత్సరాల్లోపు బాల బాలికలు ఆదివారం ఉదయం 10గంటల వరకు తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యుడు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి కప్స్, మెడల్స్ ఇవ్వడంతో పాటు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. వివరాలకు 85550 08996, 93947 53343 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'పట్టభద్రుల'పై పట్టుదలతో బీఆర్ఎస్

వరుసగా ఐదోసారి విజయమే లక్ష్యం

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో సన్నద్ధం
- నియోజకవర్గాల వారీగా విస్తృత సమావేశాలు
- బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి సుడిగాలి ప్రచారం
- ఈ నెల 19, 21, 24 తేదీల్లో రాకేశ్‌రెడ్డి ప్రచార షెడ్యూల్

నల్లగొండ ప్రతినిధి, మే 17 (నమస్తే తెలంగాణ) : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నికపై బీఆర్ఎస్ పట్టుదలతో ముందుకు సాగుతున్నది. నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇక్కడ బీఆర్ఎస్ విజయధ్వంకా మోగిస్తూ వస్తున్నది. ప్రస్తుతం జరుగుతున్న ఉప ఎన్నికల్లో సైతం గెలుపొంది వరుసగా ఐదో విజయాన్ని నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగా ఈ నెల 15న తెలంగాణ భవన్‌లో మూడు ఉమ్మడి జిల్లాల ముఖ్యనేతల సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రచార వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. మర్నాడు నుంచే పార్టీ యావత్తు ప్రచార రంగంలోకి దిగింది. మరోవైపు బీఆర్ఎస్ అభ్యర్థిగా విద్యావంతుడు, రాజకీయ విశ్లేషకుడు, ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకగా పేరొందిన ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఇప్పటికే విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఆయనకు పట్టభద్రుల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నది.

అన్ని నియోజకవర్గాలను చుట్టి వచ్చేలా..

2007లో ఏర్పాటైన పట్టభద్రుల నియోజవర్గంలో ఇప్పటి వరకు నాలుగు సార్లు ఎన్నికలు జరుగగా అన్ని సార్లు బీఆర్ఎస్ గెలుపొందింది. ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికై తన పదవికి రాజీనామా చేయడంతో అనివార్యమైన ఉప ఎన్నికలోనూ మరో విజయం కోసం బీఆర్ఎస్ సన్నద్ధమైంది. ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల ముఖ్య నేతలందరూ పార్టీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి గెలుపు కోసం రంగంలోకి దిగారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మాజీ మంత్రి గంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో ఉప ఎన్నికల ప్రచారం ఊపందుకున్నది. ఈ నెల 15న కేటీఆర్‌తో మీటింగ్ ముగిసిన వెంటనే అక్కడే జిల్లా నేతలు భేటీ అయ్యారు. ప్రచార వ్యూహంపై చర్చించారు. ఈ మేరకు 16న సూర్యాపేటలో జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో.. కోదాడ, దేవరకొండ, నల్లగొండ నియోజవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో పార్టీ ముఖ్యులతో సమావేశాలు నిర్వహించారు. శుక్రవారం మునుగోడులో జరిగిన సమావేశంలోనూ జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు. పట్టభద్రుల ఓటర్ల జాబితాను ముందే సుకుని ప్రతి ఓటరును కలిసి ఓట్లు అభ్యర్థించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. మరోవైపు ఈ నెల 16న భువనగిరిలోని స్థానిక నేతలతో కలిసి మార్నింగ్ వాకర్స్, బార్ అసోషియేషన్ సభ్యులను కలిసి బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ నెల 27న పోలింగ్ జరుగనుండగా 25న సాయంత్రం 4గంటలకు ప్రచారానికి తెరపడనుంది. ఈ నేపథ్యంలో ప్రచారానికి మరో ఎనిమిది రోజులే గడువు మిగిలి ఉండడంతో అభ్యర్థి రాకేశ్‌రెడ్డి అన్ని నియోజకవర్గాలను చుట్టి వచ్చేలా ప్రచార షెడ్యూల్ కూడా ఖరారు చేశారు. ఈ నెల 19న భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల్లో, 21న నల్లగొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్‌లలో, 24న నకిరేకల్, మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి ప్రచారం నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు. అభ్యర్థి రాకేశ్‌రెడ్డి ప్రచారంతో సంబంధం లేకుండానే మరోవైపు క్షేత్రస్థాయిలో ఓటర్లందరినీ ఎక్కడికక్కడే పార్టీ నేతలు, కార్యకర్తలు కలిసి ఓట్లను అభ్యర్థించనున్నట్లు పార్టీ నేతలు వెల్లడించారు. ప్రభుత్వంపై వ్యతిరేకత, ఆరు గ్యారెంటీల అమలులో వైఫల్యం, జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడం, నిరుద్యోగ భృతి ప్రకటించకపోవడం వంటి కీలక అంశాలతో పాటు కేసీఆర్ హయాంలో చేపట్టిన ఉద్యోగ నియామకాలను వివరిస్తూ విస్తృత ప్రచారం చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

ఆత్మకూరు(ఎం)లో వర్షానికి తడిసిన ధాన్యం రాశులు

రైతు కష్టం నేలపాలు

ఆత్మకూరు(ఎం), మే17 : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నది. యాసంగి ధాన్యాన్ని మార్కెట్లు, కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చి 30 నుంచి 40 రోజులవుతున్నా కాంటాలు వేయడం లేదు. దాంతో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసి ముద్దవుతున్నది. ఆత్మకూర్.ఎం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గురువారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం వరదలో కొట్టుకుపోయింది.

ఆత్మకూరు(ఎం) సబ్ మార్కెట్ యార్డులో ధాన్యం తడిసి మొలకలు కూడా వచ్చాయి. దాంతో రైతులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోలేక నానా అవస్థలు పడుతున్నారు.

అగ్నివీర్ వాయు నియామక ర్యాలీకి దరఖాస్తులు ఆహ్వానం

నల్లగొండ రూరల్, మే 17 : కాన్పూర్, బెంగళూర్‌లలో అగ్నివీర్ వాయు (సంగీతకారుడు) నియామకానికి భారత వాయు సేన ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీకి అర్హులైన అభ్యర్థుల నుంచి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎన్.పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు http.agnipathvayu.cdac.in ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. జూలై 2, 2007 నుంచి జనవరి 2, 2024 మధ్య జన్మించి ఉండాలని, అవివాహిత పురుష, స్త్రీ అభ్యర్థులు అర్హులని తెలిపారు. తాత్కాలికంగా అడ్మిడ్ కార్డు జారీ చేసిన నమోదిత అభ్యర్థులకు మాత్రమే రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనేందుకు అనుమతి ఉంటుందని, రిక్రూట్‌మెంట్ ర్యాలీ తేదీ, సమయం, తాత్కాలిక అడ్మిట్ కార్డులో పేర్కొంటారని పేర్కొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులదే విజయం
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, మే 17 : హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ పూర్తి గా విఫలమైందని, అంచనాకు మించిన హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలకు మొహం చాటేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 400 హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో విస్మరించిందని, ఎక్కడ చూసినా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారని తెలిపారు. తెలంగాణ సమగ్రంగా అభివృద్ధిలో పరుగులు తీసిందంటే ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలనలోనే అని అన్నారు. ప్రజలందరికీ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేశారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం ఏనుగుల రాకేశ్‌రెడ్డి విజయ దుందుబి మోగిస్తారన్నారు. భువనగిరి ప్రాంత ప్రజలు, ఓటర్లు చైతన్యవంతులని, సరైన నాయకున్ని ఎన్నుకోవడంలో ముందుంటారని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కుతాడి సురేశ్, వల్లపు విజయ్ తదితరులున్నారు.

ఆదర్శ పాఠశాలల్లో పనులను వేగవంతంగా చేపట్టాలి

- యాదాద్రి కలెక్టర్ హనుమంతు జెండగే

భువనగిరి కలెక్టరేట్, మే 17 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతులకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, మండల విద్యాధికారులు, ఏపీఎంలు, మెప్మా అధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో తాగు నీటి పనులపై ఆయన సమీక్షించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, టాయిలెట్లు, ఎలక్ట్రిసిటీ, పెయింటింగ్, బెంచీలు, గ్రీన్ చాక్ బోర్డు తదితర పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల్లో పనులు చేపట్టక ముందు, చేపట్టిన తర్వాత ఫొటోలను తీయాలని చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల తోడ్పాటుతో పనులు పూర్తి చేయాలని, పాఠశాలల్లో అన్ని వసతులతో రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యార్థులకు స్వాగతం పలుకాలని సూచించారు. విద్యార్థులకు యూనిఫామ్ కుట్టు పనులు స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలని, ఏ సంఘంలోనైనా కెపాసిటీకి తగిన పనులు చేయలేకపోతే ఇతర సంఘాలకు అప్పగించాలని, క్షేత్రస్థాయిలో ఏపీఎంలు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి ఇంటికీ తాగునీరు అందించేలా కార్యాచరణ ఉండాలని, సమ్మర్ యాక్షన్ ప్లాన్ పకడ్బందీగా అమలు చేయాలని చెప్పారు. ప్రతినెలా 1, 11, 21 తేదీల్లో ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని, తాగునీటి అవసరాలకు ఎస్‌డీఎఫ్, డిపార్టుమెంట్, గ్రామ పంచాయతీ నిధులను వినియోగించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎంఏ కృష్ణన్, జిల్లా విద్యా శాఖ అధికారి కె.నారాయణరెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల ఇన్‌చార్జి ఒంటెద్దు నరసింహారెడ్డి

పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం

- నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్
- హుజూర్‌నగర్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఒంటెద్దు నరసింహారెడ్డి

హుజూర్‌నగర్, మే16 : పట్టుదలతో పని చేస్తే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించవచ్చని బీఆర్ఎస్ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఒంటెద్దు నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పద్మశాలీ భవన్‌లో ఏర్పాటు చేసిన నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎన్నికల బీఆర్ఎస్ నియోజకవర్గ బూత్‌స్థాయి సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరుద్యోగులకు రూ.4వేల భృతి, రూ.5లక్షల క్రెడిట్ కార్డు ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు వారిని మోసం చేసిందన్నారు. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి వాటి ఊసే మరిచిందని తెలిపారు. మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలు కల్పించామంటూ సీఎం రేవంత్‌రెడ్డి పచ్చి అబద్దాలు ఆడుతున్నాడని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన 30వేల ఉద్యోగాలను ఆయన ఇచ్చినట్లు రేవంత్ తప్పుడు ప్రచారం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వం చేస్తున్న మోసానికి తగిన బుద్ధి చెప్పడానికి నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి హుజూర్‌నగర్ నియోజకవర్గంలో భారీ మెజార్టీ వచ్చే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు కొప్పుల సైదిరెడ్డి, జగన్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు కేవీఎన్‌రెడ్డి, అప్పిరెడ్డి, జక్కుల నాగేశ్వర్‌రావు, బెల్లకొండ అమర్, రంగాచారి, కృష్ణానాయక్, పిచ్చయ్య, బసవయ్య, సత్యనారాయణ రెడ్డి, నగేశ్ రాథోడ్, చెవుల కవిత, రాంబాబు, షేక్ అలీ, అంజిరెడ్డి, పరశురాం పాల్గొన్నారు.

అర్వపల్లి : కొమ్మాల ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ ఎస్. వెంకట్రావ్

అర్వపల్లి, మే 17 : చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తారని, ఎక్కడైనా తడిసిన ధాన్యం ఉంటే వాటిని కూడా కొనుగోలు చేయిస్తామని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. మండలంలోని కొమ్మాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాయిల్ రైస్ మిల్లులకు అందజేయాలని తాసీల్దార్ డీఎస్ఓకు సూచించారు. జాజిరెడ్డిగూడెంలో మొత్తం 24సెంటర్లకు 20 సెంటర్లలో ధాన్యం కొనుగోలు పూర్తయిందని 1 సెంటర్‌లోనే 4 లారీల ధాన్యం ఉందని తాసీల్దార్ శ్రీనివాసులు జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. ఐకేపీ సెంటర్‌లో ధాన్యాన్ని రేపటికల్లా కొనుగోలు చేసి లారీల ద్వారా ఎగుమతి చేయాలని ఏపీఎం మల్లేశ్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 2,30,613 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, రైతుల ఖాతాల్లో రూ.367 కోట్లు జమ చేశామని తెలిపారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల పనులను తనిఖీ చేసి, జూన్ 5వరకు ఆన్‌లైన్ పూర్తి చేయాలని పీఆర్ఏఈ అశోక్‌ను ఆదేశించారు. పాఠశాలను ప్రారంభించిన తర్వాత విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలిగినా ఊపేక్షించేది లేదన్నారు. కాసర్ల పహాడ్‌లో పల్లె దవాఖాన తనిఖీ చేసి తాళం వేసి ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది గైర్హాజరుపై ప్రజలను ఆరా తీసి తెలుసుకున్నారు. ఆశ వర్కర్ అన్నపూర్ణ మధ్యాహ్నం 2.30 నిమిషాలకు దవాఖాన తెరిచిందని, డాక్టర్ గౌతమి గురించి ఆశ వర్కర్‌ను అడగగా అత్యవసరమై బ్యాంకుకు వెళ్లిందని తెలిపారు. విషయాన్ని ఫోన్ ద్వారా డీఎంహెచ్‌ఓకు తెలిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు పల్లె దవాఖానలో సిబ్బంది అందుబాటులో ఉండాలని, లేని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సందీప్‌కుమార్, ఏపీఎం మల్లేశ్, సెంటర్ ఇన్‌చార్జి యాదమ్మ, గ్రామ పంచాయతీ సెక్రటరీ మూర్తి శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన మాజీ ఎంపీ బడుగుల

పట్టభద్రులంతా బీఆర్ఎస్ వెంటే..

- వైఫల్యాలకు కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ
- బీజేపీతో కొత్తగా ఒరిగేదేమీ లేదు
- తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష
- మాయమాటల పార్టీలను ఎవరూ నమ్మరు
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థికి అత్యధిక మెజారిటీ ఖాయం
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- సూర్యాపేటలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం

సూర్యాపేట టౌన్, మే 17 : మాయ మాటలు, నెరవేర్చలేని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అనతి కాలంలోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్నదని, అన్ని రంగాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ చక్కటి పాలనను దూరం చేసుకున్నామనే భావన అందరిలో ఉందని, ప్రస్తుతం అన్ని రంగాల ప్రజలతో పాటు పట్టభద్రులంతా బీఆర్ఎస్ వెంటే ఉన్నారని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా సూర్యాపేటలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని, వైఫల్యాలకు కేరాఫ్ ఆ పార్టీ అని ఎద్దేవా చేశారు. బీజేపీతో తెలంగాణకు కొత్తగా ఒరిగేదేమీ లేదన్నారు. ఆ రెండు పార్టీలు అధికారం కోసం పాకులాడటం తప్ప, ప్రజల అవసరాలు, కష్ట సుఖాలు పట్టవని చెప్పారు. జాతీయ పార్టీలతో రాష్ట్రాలకు ఒరిగేదేమీ లేదని, ప్రాంతీయ పార్టీలతోనే అన్ని రంగాల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. సుమారు 14 ఏండ్లు పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పదేండ్ల కాలంలోనే వందేండ్ల అభివృద్ధిని చేసి చూపించిన ఘనత కేసీఆర్‌దేనని, తెలంగాణకు ఆయనే శ్రీరామరక్ష నేడు ప్రజలందరికీ అర్థమైందని తెలిపారు. అధికార దాహంతో మోసపూరిత రాజకీయాలకు పాల్పడే పార్టీలను ప్రస్తుతం ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. అతి తక్కువ సమయంలో కాంగ్రెస్‌పై జనం నుంచి వ్యతిరేకత వచ్చిందని, అన్ని రంగాల ప్రజల్లో బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్‌పై మరింత విశ్వాసం పెరిగిందని తెలిపారు. ఇటీవల కేసీఆర్ నిర్వహించిన బస్సుయాత్రకు ప్రజలనుంచి వచ్చిన స్పందనే అందుకు నిదర్శనమని చెప్పారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ప్రజల తీర్పును అంతా అంగీకరించక తప్పదని అన్నారు. కానీ ప్రజా క్షేత్రంలో ఎక్కువ కాలం నిలువాలంటే మనం చేసిన మంచి పనులు, అభివృద్ధి, ప్రశాంత వాతావరణం ముఖ్యమని తెలిపారు. ఈ నెలలో జరుగనున్న గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పట్టభద్రులంతా ఏకమై బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించడం ఖాయమన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, జడ్పీటీసీ జీడి భిక్షం, ఎంపీపీలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేటలో సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి తదితరులు

బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్ రెడ్డి గెలుపు తథ్యం

- మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ, మే 17 : బీఆర్ఎస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డితో కలిసి మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఇప్పటివరకు నాలుగు సార్లు జరుగగా, నాలుగు పర్యాయాలు బీఆర్ఎస్ అభ్యర్థులే గెలిచారన్నారు. రాకేశ్‌రెడ్డి ఉన్నత విద్యావంతుడు అని, ఆయనకు పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యల పట్ల అవగాహన ఉందని తెలిపారు. రాకేశ్‌రెడ్డిని గెలిపిస్తే పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 1.64లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను ఇచ్చిందని, మరో 30వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తి చేయగా ఈలోగా ఎన్నికలు రావడంతో ఫలితాలను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసి ఆ ఉద్యోగాలను తామే ఇచ్చినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. కేసీఆర్ హయాంలో ప్రైవేట్ రంగంలో 20లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని తెలిపారు. పట్టభద్రులు రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

ఈ నెల 21న పట్టణంలోని టీఎన్ఆర్ గార్డెన్‌లో 2వేల మంది పట్టభద్రులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నామని, దీనికి అభ్యర్థి రాకేశ్‌రెడ్డితోపాటు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మోసిన్‌అలీ, జొన్నలగడ్డ రంగారెడ్డి, నారాయణరెడ్డి, బాబయ్య, కరుణాకర్‌రెడ్డి, మల్లేశ్ గౌడ్, ఫయాజ్, రవీందర్, అంజయ్య పాల్గొన్నారు.

నల్లగొండలోని డీవీఎం కళాశాలలో పరీక్షలను పరిశీలిస్తున్న నీఓఈ ఉపేందర్‌రెడ్డి

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

రామగిరి, మే 17: మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో శుక్రవారం సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం రెగ్యులర్ 6 సెమిస్టర్, మధ్యాహ్నం బ్యాక్ లాగ్ 1 సెమిస్టర్ పరీక్షలు జరిగినట్లు పరీక్షల విభాగం అధికారులు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 46 పరీక్ష కేంద్రాల్లో ఉదయం జరిగిన ఆరో సెమిస్టర్ పరీక్షలకు 8,954మంది విద్యార్థులకు 8,314 మంది.. మధ్యాహ్నం జరిగిన సెమిస్టర్ -1 బ్యాక్ లాగ్ పరీక్షలకు 945మందికి 832మంది హాజరైనట్లు తెలిపారు. నల్లగొండతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలను పరీక్షల నియంత్రణాధికారి జి.ఉపేందర్‌రెడ్డి తనిఖీ చేశారు. ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్స్, ప్రత్యేక పరిశీలకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని పరీక్ష కేంద్రాలను ఎంజీయూ వీసీ ఓఎస్‌డీ అంజిరెడ్డి, సూర్యాపేట జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాలను అసిస్టెంట్ పరీక్షల నియంత్రణాధికారి లక్ష్మీప్రభతోపాటు పలువురు అధికారులు పరిశీలించారు.